# పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి ప్రసంగము

## విశ్వ వేదవ్యాపక ఆదివారము 2024

## అక్టోబరు 20, 2024

### "వెళ్ళి, ప్రతి ఒక్కరిని విందుకు ఆహ్వానించుడు" (చూ. మత్త 22:9)

## ప్రియ సహోదరీ సహోదరులారా!

ఈ సంవత్సరము వేదవ్యాపక ఆదివార సందేశమునకు, సువిశేషములోని "పెండ్లి విందు" (మత్త 22:1-14) ఉపమానమును ఎన్నుకొన్నాను. విందుకు ఆహ్వానింపబడిన అతిథులు వచ్చుటకు నిరాకరించినప్పుడు, ఉపమానములోని ప్రధాన పాత్రధారియైన రాజు తన సేవకులతో "మీరు రాజమార్గములోనికి వెళ్ళి కనబడిన వారందరిని ఈ వివాహ విందుకు పిలుచుకొనిరండు" (వచ. 9) అని చెప్పెను. ఉపమానములోని ఈ కీలక సందర్భాన్ని, యేసుక్రీస్తు జీవిత సందర్భాన్ని అన్వయించుకొని మనం ధ్యానం చేసినట్లయితే, సువార్త వ్యాప్తికి అవసరమైన అనేక ప్రముఖ అంశాలను మనం తెలుసుకోవచ్చు. అవి ప్రత్యేకంగా నేటి ఆధునికయుగంలో, విశ్వ శ్రీసభ ప్రయాణపు చివరి దశలో ఉన్న క్రీస్తు సువార్తా శిష్యులమైన మనందరము, దాని లక్ష్యమైన సహవాసం (Communion) భాగస్వామ్యం (Patricipation) ప్రేషితకార్యం (Mission) అను అంశాలు శ్రీసభ ప్రాథమిక బాధ్యతయైన సువార్తా బోధనపై మరలా దృష్టి సారించేటట్లు చేస్తాయి.

**1. "వెళ్ళి, ఆహ్వానించండి" ప్రభువిందుకు ఇతరులను పిలుచుటకు అవిశ్రాంతంగా బయల్వెడలుటయే ప్రేషితకార్యము.**

రాజు తన సేవకులకు ఇచ్చిన ఆజ్ఞలో వారి లక్ష్యాన్ని కేంద్రమైన రెండు మాటలు మనకు కన్పిస్తాయి. అవి ఒకటి రాజమార్గాలకు పోవడం, రెండవది ఆహ్వానించడం.

మొదటిగా మనం గుర్తుంచుకోవాల్సింది, ఆహ్వానింపబడిన అతిథులను పిలుచుటకు రాజు తన సేవలకులను పంపాడు. (వచ 3-4) కాబట్టి ప్రేషితకార్యం అంటే అలుపెరగకుండా ప్రజలలోకి వెళ్ళి అందరూ దేవుని తెలిసికొని ఆయన సహవాసంలోనికి రావడానికి మనం ఆహ్వానించాలి. అవిశ్రాంతత! కొంతమంది ఉదాసీనత, తిరస్కార భావము ప్రదర్శించినప్పటికి, దేవుడు ఎంతో ప్రేమతో అంతులేని దయతో వారందరిని తన దైవరాజ్యపుటానందములోనికి పిలుచుటకు జనుల మధ్యకు వెళ్తున్నారు. మంచికాపరియైన క్రీస్తు తప్పిపోయిన గొర్రెలవలెనున్న ఇశ్రాయేలీయులను మాత్రమేగాక సుదూరములోనున్న వారిని సైతం వెదకుటకు ప్రగాఢ కోరికతో ఉన్నారు. (చూ. యోహా 10:16) ఈ కారణం చేతనే తన శిష్యులను సహితం ఈ పరిచర్యలో భాగస్థులను చేస్తూ, తన ఉత్థానాన్ని ముందూ తరువాత కూడా "వెళ్ళండి" (లూకా 10:3, మార్కు 16:15) అంటున్నారు. శ్రీసభకూడా తన వంతుగా, తాను ప్రభువు నుండి పొందిన ప్రేషితకార్యాన్ని విశ్వాసపాత్రముగా ఎన్ని కష్టాలు, ఆటంకాలు ఎదురైనా నిరాశానిస్పృహలకు లోనుగాకుండా, అలుపెరుగక భూ దిగంతముల వరకూ మళ్ళీ మళ్ళీ ప్రజల మధ్యకు వెళ్తూ తన సువార్తా పరిచర్యను కొనసాగిస్తుంది.

ఈ సందర్భములో క్రీస్తు పిలుపును అనుసరించి తన బంధుమిత్రాదులను, తమ సమస్తాన్ని చివరకు తమ స్వదేశాన్ని సహితం పరిత్యజించి నేటివరకూ క్రీస్తు సువార్త బోధింపబడని వారికి, నూతనముగా (ఈ మధ్యనే) బోధింపబడిన వారికి సువార్త పరిచర్య చేయుటకు సుదూర ప్రాంతలకు వెళ్ళిన సువార్తికులందరకు (Missionaries) కృతజ్ఞతలు చెల్లిసున్నాను. ప్రియ స్నేహితులారా! సువార్తికులారా!

క్రీస్తు తన శిష్యులకు అప్పగించిన "వెళ్ళి సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మత్త 28:19) తను పరిచర్య ఉదార స్వభావముతో మీరు అంకితం కావడము "పంపబడుట" (Adgentes) పరిచర్యకు ప్రత్యక్ష నిదర్శనము. భూదిగంతముల వరకు సువార్తా ప్రకటనకై వెల్లువెత్తుతున్న అనేక నూతన దైవ పిలుపుల కోసం అనునిత్యము ప్రార్థిస్తూ అదేవాది దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

ప్రతి క్రైస్తవుడు అన్ని పరిస్థితులలో సువార్తకు సాక్ష్యమివ్వడానికి పిలువబడ్డాడు అన్న విషయాన్ని మనమెప్పుడూ మరచి పోకూడదు. తద్వారానే యావత్ శ్రీసభ తన గురువు, ప్రభువైన యేసుతో కలిసి నేటి ప్రపంచ జనావాస కూడళ్ళలోనికి నిరంతరము వెళ్ళగలదు. “శ్రీసభలో నేడు జరిగేతంతు ఏమిటంటే యేసుక్రీస్తు బయటనుండి కాదుగాని లోపలనుండి తనను బయటకు వెళ్ళనీయమని తలుపులు తడుతున్నారు. తరచూ, మనము ఆయన ఏదో కేవలం మన స్వంతమే అన్నట్లు లోపలే బంధిచి ఉంచుతాము. బయటకు వెళ్ళనీయము. కాని ప్రభువు సువార్తా బోధనకే వచ్చారు. అలాగే మనలను కూడా సువార్తా బోధకులుగా ఉండాలని కోరుతున్నారు.” జ్ఞాన స్నానము పొందిన వారందరమూ, శ్రీసభ తొలినాళ్ళలో ఏవిధంగా సువార్తా వ్యాప్తి ఉద్యమాన్ని నడిపిందో అలాగే మన స్థాయికి తగినట్లు నేటి సువార్తా వ్యాప్తిలో నూతన ఒరవడిని సృష్టించడానికి సిద్ధంగా ఉండాలి.

ఉపమానములోని రాజాజ్ఞను పరిశీలిస్తే: రాజు తన సేవకులకు ‘వెళ్ళు’ అని మాత్రమే కాదుగాని “ఆహ్వానించండి” అనికూడా చెప్పాడు. “విందుకు రండు!” (మత్త 22:4) ఇక్కడ మనం గమనించవలసిన మరొక ముఖ్యమైన అంశము ఎమిటంటే: “దేవునిచే అప్పగింపబడిన సువార్తా పరిచర్య. సేవకులు రాజుగారి ఆహ్వానాన్ని దాని ఆవశ్యకతతో మాత్రమే గాకుండా, ఎంతో గౌరవమర్యాదలతో అందజేసినట్లు మనం ఊహించుకోవచ్చు. అదేవిధంగా సువార్తను స్వీకరించే ప్రతి వారికీ వారివారి జీవన శైలిని అనుసరించే సువార్తా పరిచర్య చేయాల్సియుంటుంది. సువార్తీకులు కూడా తమలోని ఆత్మఫలాలైన ఆనందము, ఔదార్యము, దయ (చూ. గలతీ 5:22)తో మనకై మరణించి మరల జీవముతో లేచిన “యేసుక్రీస్తునందు బయల్పరచబడిన దేవుని మధురమైన రక్షణప్రేమ” (Evangelic Gaudium, 36) ను ప్రపంచానికి ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అంతేగాక, ఒత్తిడి చేయడం, బలవంతపెట్టడం, మతమార్పిడి చేయడం లాంటివి లేకుండా, దైవ ఉనికిని, దైవ విధానాన్ని ప్రతిబింబించేటట్లు సన్నిహితతత్వముతోను, కరుణతోను, మృదుత్వముతోను ప్రకటించాల్సివుంది.

### 2. “వివాహ విందుకు” క్రీస్తు రెండవ రాకడ (లోకాంత్యము) మరియు కదరావిందుల కోణములో క్రీస్తు మరియు శ్రీసభ పరిచర్య

ఉపమానంలో రాజు తన కుమారుని వివాహవిందుకు ఆహ్వానించడానికి సేవకులను పంపుతున్నాడు. ఈ విందు యుగాంతములోని యేసు రెండవరాకడ రక్షణవిందుకు సూచనగా వుంది. యెషయా ప్రవక్త నుడివినట్లు దేవుడు మరణమును శాశ్వతముగా ధ్వంసము చేసి, ప్రశస్తమాంస భక్ష్యములతోను, తేరుకొనిన ద్రాక్ష సవముతోను పవిత్ర పర్వతముపై చేసిన విందు (యెష 25:6–8), “నేడు మనకు సమృద్ధిగా జీవమునొసగిన” (యోహా 10:10) మెస్సయ యైన దైవకుమారుడు యేసు రాకడ ద్వారా దైవరాజ్యములోని రక్షణ విందునందు సంపూర్తియగుచున్నది.

“కాలము సంపూర్ణమైనది దైవరాజము సమీపించినది”. (మార్కు 1:15) అని యేసు తన బోధనా ప్రారంభములోనే చెప్పినట్లు, క్రీస్తుపరిచర్య “సంపూర్ణ కాలముతో” ముడిపడివుంది. తమ బోధకుడు, రాజునైన క్రీస్తుయొక్క ఈ పరిచర్యను కొనసాగించడానికై యేసు శిష్యులు పిలువబడ్డారు. ఈ సందర్భంలో మనం ద్వితీయ వాటికను మహాసభకు ఎంతైనా కృతజ్ఞతలు తెలుపవలసియుంది. ఎందుకంటే శ్రీసభ యుగాంతంము లేక క్రీస్తు రెండవ రాకడ స్వభావముతో ప్రపంచానికి చేరువకావాలి. “సువార్తా పరిచర్య కార్యాచరణ, యేసు ప్రధమ రాకడ నుండి రెండవ రాకడ వరకూ కొనసాగుతుంది. ఎందుకంటే యేసు ద్వితీయ రాకడకు ముందే సకల జాతులకు సువార్తా బోధింపబడవలయును (చూ. మార్కు 13:10).” (Adgentas 9)

ప్రధమ క్రైస్తవుల సువార్తా పరిచర్యలో యేసురెండవ రాకడను గూర్చిన భావాలు అధికంగానే ఉండేవి అవి మనకు తెలుసు. సువార్తా బోధన యొక్క ఆవశ్యకతను వారు గుర్తించారు. ఈ రోజుల్లో కూడా అదే కోణంలో సువార్తా ప్రచారం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఎందుకంటే “ప్రభువు చేరువలో ఉన్నారు (త్వరలో రానున్నారు)” అని తెలుసుక్నువారి ఆనందంతోనూ, అదే నమ్మకము, ఆశతో లక్ష్యంవైపుకు దూసుకెళుతున్న వారి ఆనందంతోనూ కలిసి, మనం కూడా దైవరాజ్యపు వివాహ విందులో క్రీస్తుతో కలిసి ఉంటామన్న ఆనందము మన సువార్తా పరిచర్యకు ఎంతగానో దోహద పడుతుంది. నేటి ఆధునిక ప్రపంచము వినియోగ దారావాదం, స్వార్థపూరిత సౌకర్యాలు, సంపదలు కూడబెట్టుకోవడం, వ్యక్తివాదము అను వివిధ పసందైన విందులు మనముందుచుతున్న నేపధ్యంలో, ఆనందముపంచుకోవడము, ధర్మము, సోదరభావము, దైవమానవ సహవాసములతో కూడిన మధురమైన దైవవిందుకు ప్రతిఒక్కరికి సువార్త పిలుపునిస్తుంది.

యేసుని బహుమానమయిన సంపూర్ణ జీవము, నేడు క్రీస్తు ఆజ్ఞననుసరించి, ఆయన జ్ఞాపకార్థము నెరవేర్చబడుతున్న దివ్యసత్ప్రసాద విందులో ముందుగానే బయల్పరచబడుతుంది. ప్రతి ఒక్కరికి యుగాంతపు విందుకు మనమిచ్చే ఆహ్వానం, అంతర్గతంగా ప్రభువు తన

దివ్యవాక్కు, శరీరరక్తములతో మనలను పోషించు దివ్యసత్ప్రసాద విందుతో ముడిపడివుంది. 16వ బెనడిక్టు పాపుగారు బోధించినట్లు: ప్రతి దివ్యబలిపూజా సంస్కారములో దైవప్రజల యుగాంతపు విందు పరిపూర్తియగుతుంది. యుగాంతపు విందుకై దైవ ప్రజల సమావేశము ప్రతి దివ్యబలిపూజద్వారా పరిపూర్ణమవుతుంది. వాస్తవానికి దివ్యసత్ప్రసాదవిందు మనందరకూ, ప్రవక్తలు ప్రవచించిన చివరివిందు (యెష 25:6-9), నూతన నిబంధనలో వివరించబడిన "గొర్రెపిల్ల వివాహవిందు" (దర్శన 19:9) సకల పునీతుల సహవాసంలోని (Sacramentam Caritas 31) ఆనందపు వేడుకల విందుకు మచ్చుతునక (ముందస్తు రుచిగా) గ వుంటుంది.

తత్ఫలితముగా, ప్రతి దివ్యవిందులోనూ, దాని వివిధ కోణాలలో ప్రత్యేకంగా క్రీస్తు రెండవరాకడ (యుగాంతపు) మరియు ప్రేషిత కార్య కోణాలలో నుండి అనుభూతి పొందడాన్ని పిలువబడ్డాము.

ఈ సందర్భంగా "దేవుని హృదయంలో ప్రారంభమై ప్రజలందరకూ చేరాల్సిన సువార్తా పరిచర్యలోనికి ఆకర్షింపబకుండ మనము దివ్యసత్ప్రసాదవిందును సమీపించలేము". (Ibid 84) అని పునరుద్ఘాటిస్తున్నాను. కోవిడ్ అనంతరపు ప్రస్తుత యుగంలో చాలా స్థానిక శ్రీసభలు దివ్యబలిపూజా పునరుద్ధరణ గావించడముకూడా విశ్వాసులలో వేదవ్యాపక స్ఫూర్తి పురుద్ధరింపబడడానికి ఎంతో అవసరము. అప్పుడే **"ప్రభువా! మీ మరణమును ప్రకటించెదము, మీ ఉత్థానమును చాటెదము. మీరు మరల వచ్చు వరకు వేచియుందుము"** అని ఎంతో గొప్ప విశ్వాసముతో, హృదయపూర్వక ఉత్సాహముతో ప్రతి దివ్యబలిపూజలో మనము ప్రకటించగలము.

2025 జూబిలీకి సిద్ధపడుటకై ప్రార్థనకు అంకితము చేయబడిన ఈ సంవత్సరములో, అందరూ నిబద్ధతతో దివ్యబలి పూజలో పాల్గొని శ్రీసభయొక్క వేదవ్యాపక పరిచర్య కొరకు ప్రార్థించాలని అందరనూ ప్రోత్సహిస్తున్నాను. మన రక్షకుని పరమోపదేశములను శిరసావహిస్తూ "మీ రాజ్యము వచ్చునుగాక" అను విన్నపముతో కూడిన పరలోక ప్రార్థనను ప్రతి దివ్యబలిపూజలోనూ ఇతర దైవార్చనలలోనూ శ్రీసభ నిరంతరమూ ప్రార్థిస్తుంది. ఈ విధముగా అనుదిన ప్రార్థనలు, దివ్యబలిపూజలు మనలను నమ్మకముతోకూడిన వేద ప్రచారకులుగా, యాత్రికులుగా దేవునియందలి నిత్యజీవమునకు, దేవుడు తన బిడ్డలకై సిద్ధపరచి వివాహవిందుకు పయనించేటట్లు చేస్తాయి.

## 3. "ప్రతి ఒక్కరు" సంపూర్ణ వేదవ్యాపక శ్రీసభలో క్రీస్తు శిష్యులు సార్వత్రిక సువార్తా పరిచర్య

చివరిగా మూడవ అంశము: రాజుగారి ఆహ్వానాన్ని అందుకున్నవారు "అందరు". నేను ముందుగా ఉద్ఘాటించినట్లు "ఎవరికీ మినహాయింపులేకుండా "అందరు" అనునది సువార్తా పరిచర్యకు గుండె (కేంద్రబిందువు) వంటిది. ప్రతి పరిచర్య, అందరనూ తనవద్దకు ఆకర్షించుటకై క్రీస్తు హృదయము నుండే పుట్టినది". (పాపుగారి సభల సాధారణ సమావేశములోని సందేశము: జూన్ 3, 2023) ఈ రోజుల్లో విభజనలు, సంఘర్షణలు (గొడవల)తో ముక్క చెక్కలైన నేటి ప్రపంచములో అందరూ ఒకరికొకరు చేరువకావడానికి, వారందరు సహోదరులు అని గుర్తించడానికి వైవిధ్యంలోనూ సామరస్యంగా ఆనందంతో జీవించడానికి, క్రీస్తు సువార్త అందరనూ వ్యక్తిగతంగా, మృదువుగా అయినా స్థిరంగా గొంతెత్తి పిలుస్తోంది. "మానవులందరు రక్షింపబడవలయుననియు, సత్యమును తెలుసుకొనవలెననియు దేవుని అభిలాష" (1 తిమోతి 2:4) కాబట్టి మన సువార్తా పరిచర్యలో అందరకూ క్రీస్తు సువార్తను అందించాలి అన్న అంశాన్ని మనమెప్పుడూ మరువకూడదు. "క్రొత్త క్రొత్త విధానాల భారాన్ని మోపే వారిమిగా కాకుండా, వారి ఆనందాన్ని పంచుకునే వారిమిగా, నూతనత్వాన్ని చూపించేవారిమిగా, షడ్రుచులతో కూడిన పసందైన విందుకు ఆహ్వానించేవారిమిగా ఉండాలి" (కన్పించాలి) (Evangelii Gaudium 14)

క్రీస్తు సువార్తా పరిచర్య శిష్యులు, ఎవరి సామాజిక, నైతిక స్థితిగతులు ఎలావున్నా అందరియెడల హృదయపూర్వక శ్రద్ధను కనబరుస్తారు. విందు ఉపమానం మనకు ఏమిచెపుతుందంటే : రాజు ఆదేశాలమేరకే సేవకులు "మంచి చెడు భేదములేక తమ కంటబడిన వారందరను" (మత్త 22:10) తీసికొని వచ్చారు. ఇంకా చెప్పాలంటే "పేదలను, అవిటి, గ్రుడ్డి, కుంటివారిని" (లూకా 4:21), ఒక్కమాటలో చెప్పాలంటే అత్యల్పులైన మన సోదర సోదరీమణులు, సామాజికంగా అణకద్రొక్కబడినవారు ఆ రోజు రాజుగారికి, ప్రత్యేక అతిథులు. మనలో ప్రతి ఒక్కరిపై దేవునికున్న ప్రేమ అపారమైనది అవధులులేనిది. కనుకనే తాను ఏర్పాటు చేసిన తన కుమారుని వివాహ విందుకు అందరూ ఆహ్వానితులే. "దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించెను. తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశనము చెందక నిత్యజీవమును పొందుటకై అట్లుచేసెను". (యోహాను 3:16) ప్రతి మనిషి అంటే స్త్రీ పురుషులందరూ తమను రూపాంతరమొనర్చి రక్షించే దైవకృపలో భాగం పంచుకోవడానికి ఆహ్వానించబడ్డారు. అందుకు ఎవరైనా చేయాల్సిందల్లా, కేవలం ఆ దైవబహుమతికి అంగీకరించి, అది తనను మలచి, మార్చుటకు "అవును" అని సమ్మతించడమను

వివాహ వస్త్రాన్ని ధరించడం. (మత్త 22:12)

"అందరికోసం పరిచర్య" కు అందరి నిబద్ధత ఎంతో అవసరం. సువార్తా సేవలో మనమంతా సంపూర్ణ సహవాస వేదవ్యాపక శ్రీసభ వైపుకు మన ప్రయాణాన్ని కొనసాగించాలి. దైవ ప్రజల ప్రయాణం ఖచ్చితంగా (సువార్తా) పరిచర్యయైయుండాలి. అలాగే సువార్తా పరిచర్యకూడా దైవప్రజల పరిచర్యయై వుండాలి. పర్యవసానముగా నేటి విశ్వ శ్రీసభలో, ప్రాంతీయ శ్రీసభలలో సువార్తా పరిచర్య సహకారము, ఆవశ్యకము, అత్యవసరము అవుతుంది. ద్వితీయ వాటికను మరియు నా పూర్వీకుల అడుగుజాడల్లోనే పాపుగారి సువార్తా సభల (Pontifical Mission Societies) సేవలను ప్రపంచంలోని అన్ని మేత్రాసనాలు వినియోగించు కోవాల్సిందిగా నేను సిఫార్సు చేస్తున్నాను. "ఈ సభల ద్వారా కతోలికులు బాల్యమునుండి సార్వత్రిక వేదవ్యాపక స్ఫూర్తితో నింపబడుతున్నారు. అంతేగాక అన్ని విధాల సువార్తా పరిచర్యకు, వాటి అవసరాలకు అనుగుణంగా, అవసరమైన నిధులను సేకరించడంలో (Adgentes 38) ప్రాధమిక సాధనాలుగా ఈ సభలు ఉంటున్నాయి. అందుచేతనే వేదవ్యాపక చందాలను స్థానిక శ్రీసభలు పూర్తిగా పాపుగారి సార్వత్రిక నిధికి పంపబడతాయి. అనంతరము స్థానిక శ్రీసభలకు వాటివాటి సువార్తా పరిచర్యల అవసరాన్నిబట్టి వేదవ్యాపక సభ (Propagation of Faith) పాపుగారి పేరుమీద ఆ నిధిని పంపిణీ చేస్తుంది. మనమంతా ఇంకా అధిక సహవాస వేద వ్యాపక శ్రీసభగా తయారు కావడాన్ని సహాయపడుతూ ముందుకు నడిపించమని ప్రభువును ప్రార్థించుదాం. (చూ. విశ్వ పీఠాధిపతుల సాధారణ సమావేశ ముగింపు పూజాబలిలోని సందేశము, అక్టోబరు 29, 2023)

చివరిగా గలిలయలోని కానాపల్లి పెళ్ళిలో తన మొదటి అద్భుతమును చేయమని అడిగిన మరియమాతపై (చూ. యోహా 2:1-12) మన దృష్టిని నిలుపుదము. ఆ పెళ్ళిలో నూతన దంపతులకు, పెళ్ళికి వచ్చిన అతిధులకు నూతన ద్రాక్షరసమును సమృద్ధిగా ఇచ్చారు. ఇది లోకాంత్యమున దేవుడు అందరకూ తయారుచేసే వివాహవిందుకు సూచనగా వుంది. నేడు కూడా క్రీస్తు శిష్యుల సువార్తా పరిచర్యలోనూ, తమ మాతృప్రేమతో ప్రార్థించమని ఆ తల్లిని వేడుకుందాం. ఆ తల్లి మమతానురాగాలు ఆప్యాయతానందముల బలముతో (Evangelic Gaudium 28) మన రక్షకుడు, రారాజు క్రీస్తు ఆహ్వానాన్ని అందరకూ అందించుదాము. పరిశుద్ధ మరియమ్మా! వేదవ్యాపక రాజ్ఞీ! మా కొరకు వేడుకొనండి.

**పు. లాటెరను దేవాలయము, రోము**
**జనవరి 25, 2024**

**ఫ్రాన్సిస్ పాపుగారు**